క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా శనివారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రావు తెలిపారు.

- **ఉ. 10 నుంచి మ. 12 గంటల వరకు..** ఎస్‌బీహెచ్, రాగం బార్, ఐఎస్‌సదన్ వైపు వెళ్లే మార్గానికి కుడివైపు ప్రాంతాలు సహా పరిసర ప్రాంతాలు
- **మ. 12 నుంచి 2 గంటల వరకు...** మాదన్నపేట పీఎస్, ఈద్గా, వార్డ్ ఆఫీస్, ఎఫ్‌టీసీ, క్వార్టర్స్ పరిసర ప్రాంతాలు
- **సా. 4 నుంచి 6 గంటల వరకు..** నెహ్రూనగర్, మస్కతీ పార్క్, రెయిన్‌బజార్ గ్రౌండ్, కార్నర్ టీ పాయింట్ పరిసర ప్రాంతాలు

రేపు పరుగు కార్యక్రమం

వనస్థలిపురం: 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వనస్థలిపురంలోని లోటస్ ల్యాప్ పాఠశాల ఆధ్వర్యంలో ఈ నెల 13న ఉదయం 6 గంటలకు 1000 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో వనస్థలిపురంలో 3 కిలో మీటర్ల పరుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యా సంస్థ చైర్మన్ ఎ. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థి, ప్రతి పౌరునిలో దేశభక్తి, జాతీయ విద్యావిధానం 2020పై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు వనస్థలిపురంలోని లోటస్ ల్యాప్ పాఠశాల నుంచి ఈ పరుగు ప్రారంభమవుతుందన్నారు.

యాదవ విద్యావంతుల వేదిక కార్యదర్శిగా శ్రీనివాస్



హస్తినాపురం: తెలంగాణ రాష్ట్ర యాదవ విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శిగా హస్తినాపురం భూపేశ్‌గుప్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్‌యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర యాదవ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ. యాదవ హక్కుల కోసం తన శాయశక్తులా పాటుపడతానని అన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు కళాకారులకు ఆహ్వానం

సైదాబాద్: ప్రఖ్యాతి గాంచిన సాహితీవేత్తలతో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య వేడుకల్లో వర్ధమాన కళాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని వైఎస్ఆర్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి అన్నారు. శుక్రవారం ఐఎస్‌సదన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 13న బషీర్‌బాగ్‌లోని తమ కార్యాలయంలో నిర్వహిస్తున్న వేడుకల్లో 'ఇది నా భారత భూమి' అనే అంశంపై కళాకారులు తమ కవితలు, గేయాలు, పాటలు వినిపించి తమ సంస్థ నుంచి సన్మానం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చైతన్యపురి: తెలంగాణలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర టింబర్ ఫెడరేషన్, అలైడ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు చకిలం రమణయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2014 ఎన్నికల సమయంలో ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి కృషి చేస్తానని టీఆర్ఎస్ ప్రకటించిందని, రెండు దఫాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా ఇంత వరకు కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదన్నారు. ఆర్యవైశ్యుల్లోని పేద కుటుంబాల అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి తన హామీని నెలబెట్టుకోవాలని కోరారు.

జీఓ 46ను రద్దు చేయాలని ఎస్ఐ అభ్యర్థుల ఆందోళన

నాగోలు: జీఓ 46 ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కొత్తపేటలో ఆందోళన చేపట్టిన ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు...ఎస్సై, కానిస్టేబుల్ నియమకాల్లో తీసుకొచ్చిన జీఓ 46ను రద్దు చేయాలని, గతంలో మాదిరిగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. ఉమ్మడి హైదరాబాద్ జిల్లాకు 53 శాతం రిజర్వేషన్లు కల్పించి మిగతా జిల్లాలకు 47 శాతం కేటాయించారని, దీంతో ఇతర జిల్లాల్లోని అభ్యర్థులకు 130 మార్కులు వచ్చినా ఉద్యోగం దొరికే అవకాశం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, అభ్యర్థులు ఆందోళన చేస్తున్న సమాచారం తెలుసుకున్న చైతన్యపురి, నాగోలు పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 43, వంకాయ 40, బెండ 23, పచ్చిమిర్చి 50, కాకర 45, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 23, క్యారెట్ 40. దొండ 35, ఆలు 21, ఉల్లి 24, గోకర 35, దోస 28, సొర 13, పొట్ల 23, అరటి 09.

అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు



వాగ్మాత్రి అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ అరుణ తదితరులు

సైదాబాద్: అధిక శ్రావణ మాసం సందర్భంగా సైదాబాద్ ఐఎస్‌సదన్ డివిజన్ల పరిధిలోని అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని పెద్దతోటలో కొలువుదీరిన వాగ్మాత్రి అమ్మవారిని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భక్తులు కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా ప్రసిద్ధి గాంచిన పురాతన పెద్దతోట ఆలయంలోని వాగ్మాత్రి అమ్మవారు అందరినీ చల్లగా చూడాలని కోరుకున్నారు. ఆలయ చైర్మన్ అశోక్ కార్పొరేటర్‌కు శాలవా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, యువమోర్చా నాయకుడు దయా కాళి పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి



ఏపీఎస్ఈబీ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్లు వెంకటేశ్వరరెడ్డి, సుజాతానాయక్

హస్తినాపురం: వనస్థలిపురం, హస్తినాపురం డివిజన్ల పరిధిలోని సాగర్‌రోడ్డులోని కాలనీల్లో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆ డివిజన్ల కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వరరెడ్డి, బానోతు సుజాతానాయక్ అన్నారు. శుక్రవారం సాగర్‌రోడ్డులోని ఏపీఎస్ఈబీ కాలనీలో ప్రధాన రహదారిపై ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు జలమండలి అధికారులతో కలిసి వారు కాలనీలో పర్యటించారు. సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను వారు కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ, ఏపీఎస్ఈబీ కాలనీలోని ప్రధాన రహదారిలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతోందని, ఇక్కడ సమస్య శాశ్వత పరిష్కారానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఎన్‌డీపీ నిధులతో యూజీడీ పైప్‌లైన్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వారు అధికారులను కోరారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఏఈ జోష్న, ఏఈ హేమూనాయక్, శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎస్ఈబీ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రోహిత్ రెడ్డి, ప్రశాంత్, శరత్ పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం లాంటిది



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన ఆయుధం లాంటిదని, ఓటుకు ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఉందని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పటేల్‌నగర్ కాలనీలోని ఉమెన్స్ వరల్డ్ అసోసియేషన్ హాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే గతంలో ఓటు కలిగి ఉన్న వారు ఓటరు లిస్టులో తమ పేర్లు ఉన్నాయా లేదా అనేది ఒకసారి పరిశీలించుకోవాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు దీపక్, శ్రీనివాస్, గౌతంనగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి కళ్లెం మధుసూదన్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, జ్యోతి, సత్యనారాయణ, రాహుల్, టింకు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: వృద్ధులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. శుక్రవారం కొత్తపేట డివిజన్ న్యూ నాగోల్–స్నేహపురి కాలనీ సీనియర్ సిటిజన్స్ భవన్ లో మొబైల్ మెడికేర్ యూనిట్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం, ఉచిత మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పవన్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కొత్తపేట డివిజన్‌లోని సీనియర్ సిటిజన్స్‌కు, ఇతరులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు పంపిణీ చేస్తున్నందుకు మొబైల్ మెడికేర్ యూనిట్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారికి కార్పొరేటర్ ధన్యవాదాలు తెలిపారు. వైద్యాధికారులు ఈట కిరణ్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జ్ఞాన కుమార్, జనరల్ సెక్రెటరీ మధుసూదన్ రెడ్డి, బలరామ్, ఆశాలత, సంజీవ్ రాణి, యశ్వంత్‌రావు, సీతారామరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



యాకుత్‌పురా నియోజకవర్గ నాయకులతో సమావేశమైన సుందర్‌రెడ్డి

సైదాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పలు పథకాలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని ఆ పార్టీ యాకుత్‌పురా ఇన్‌చార్జి సామ సుందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఐఎస్‌సదన్ డివిజన్ భానునగర్‌లో నియోజకవర్గ పరిధిలోని పార్టీ డివిజన్ల అధ్యక్షులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కల్యాణలక్ష్మి షాదీముబారక్ పథకాలకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు పార్టీ నాయకులు సహకరించాలన్నారు. దళితబంధు, బీసీ బంధు, మైనారిటీ, గిరిజన బంధులపై ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ గెలిచి కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావటం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో వివిధ డివిజన్‌ల అధ్యక్షులు మెట్టు భాస్కర్‌రెడ్డి, నర్సింగ్ రావు, ప్రవీణ్‌రాజ్, శ్రీనివాస్, సాయిబాబా, రజా అలీ మిర్జా, ఎజాజ్, సాబేర్ పాల్గొన్నారు.

నిధులు ఉన్నా.. పనులు సున్నా!

- మలక్‌పేట మార్కెట్‌లో వింత పరిస్థితి
- డ్రైనేజీ సమస్యతో రైతులు, వ్యాపారుల అవస్థలు

చాదర్‌ఘాట్: రాష్ట్రంలోనే పెద్ద వ్యవసాయ మార్కెట్ అయిన మలక్‌పేట మార్కెట్‌లో దాదాపు రెండేళ్లుగా డ్రైనేజీ సమస్య నెలకొంది. ఈ సమస్య పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 30లక్షలు మార్కెట్‌కు విడుదల చేసినా అధికారులు, మార్కెట్ పాలకవర్గం ఈ విషయంపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా మార్కెట్‌కు వచ్చే రైతులు, తడిసిన ధాన్యం కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గం దృష్టి సారించి నిధులు వెనుకకు వెళ్లిపోకుండా చూడాలని వ్యాపారులు, రైతులు కోరుతున్నారు.

చదివేది ఇంజినీరింగ్.. చేసేది గంజాయి దందా

ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు



హస్తినాపురం: కాలేజీకి వెళ్లి బుద్ధిగా చదువుకోవాల్సిన ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు వక్రమార్గం పట్టారు. గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తూ వనస్థలిపురం పోలీసులకు చిక్కి జైలు పాలయ్యారు. వనస్థలిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తుర్కయంజాల్‌లో కొందరు గంజాయి అమ్ముతున్నారన్న పక్కా సమాచారంతో మహేశ్వరం డివిజన్ ఎస్ఓటీ పోలీసులు , వనస్థలిపురం పోలీసులు సంయుక్తంగా శుక్రవారం దాడి చేశారు. గంజాయి విక్రయిస్తున్న పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన లక్కాకుల రోహిత్ (21), కొమ్ము శ్రీనివాస్ (20), తాట సాత్విక్ (20), కరీంనగర్ జిల్లా అగునూర్‌కు చెందిన తంగవల్లి సూర్య (20), సికింద్రాబాద్ తిరుమలగిరి మోతీనగర్ కాలనీకి చెందిన తోటి ఉదయ్ (21)ను అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురూ ఇంజినీరింగ్ విద్యార్థులని, కొమ్ము శ్రీనివాస్ ఇంట్లో ఉంటూ గంజాయిని విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు. వారి నుంచి 300 గ్రాముల గంజాయి, 5 సెల్ ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

సైదాబాద్: పేదల డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 13న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం సైదాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్లక్ష్య వైఖరి వల్ల డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరు కాకపోవడంతో నిరుపేదలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వారికి బాసటగా నిలిచేందుకు ఈనెల 13న ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సహా రాష్ట్ర పార్టీ నాయకులు ధర్నాలో పాల్గొంటారన్నారు. ధర్నాకు భాగ్యనగర్ జిల్లా పరిధిలోని అన్ని డివిజన్ల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తరలిరావాలని ఆయన కోరారు.

అశోక్ అరెస్టు అక్రమం

చంచల్‌గూడ: గ్రూప్స్ పరీక్షలను వాయిదా వేయాలని నిరసనలో పాల్గొన్న ఉపాధ్యాయుడు అశోక్‌ను పోలీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జైల్లో శుక్రవారం అతడిని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్‌తో పాటు ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డిలు ములాఖత్‌లో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా జైలు వద్ద మీడియాతో వెంకట్ మాట్లాడుతూ, గ్రూప్స్ పరీక్షల పేపర్లు లీక్ చేసిన వారు రాజభోగాలు అనుభవిస్తున్నారని, పరీక్షలు వాయిదా వేయాలని కోరిని వారిని జైళ్లకు తరలిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఒంటెద్దు పోకడలకు పోయి విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటుపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎల్‌బీనగర్: ఓటు ఎంతో విలువైనది దానిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి, 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని జీహెచ్ఎంసీ సిబ్బంది తెలిపారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్‌లో శుక్రవారం ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ హరికాంత్‌రెడ్డి, బిల్ కలెక్టర్ అర్చన, కాలనీ వాసులు రాంబాబు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సెంటోనియల్ అధ్యక్షుడిగా హరీష్‌రెడ్డి

హయత్‌నగర్: లయన్స్ క్లబ్ హయత్‌నగర్ సెంటోనియల్ అధ్యక్షుడిగా ఉప్పల హరీష్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎస్‌వీ కన్వెన్షన్ హాల్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ప్రజలకు మరిన్ని సేవలు అందించి క్లబ్‌ను మరింత బలోపేతం చేస్తామన్నారు. స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో మల్టీపుల్ కౌన్సిల్ సెక్రటరీ ఎస్.రాధాకృష్ణ, డిస్ట్రిక్ వైస్ గవర్నర్ మహేందర్‌రెడ్డి, లయన్ శ్రీనివాసులు, సురేంద్రమోహన్, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



హరీష్‌రెడ్డిని అభినందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ప్రజలను మరోసారి మోసం చేస్తున్న ఎమ్మెల్యే: సామ



విలేకరులతో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: జీఓ 118 పేరిట ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఎల్‌బీనగర్ నియోజకవర్గ ప్రజలను మభ్యపెట్టి మరోసారి మోసం చేస్తున్నారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. ఎల్‌బీనగర్ చంద్రపురి కాలనీలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎల్‌బీనగర్‌లోని పేదలను మోసం చేస్తూ, ప్రజాధనాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. 118 జీఓతో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో 17 వేల మంది లబ్ధి పొందాల్సి ఉండగా, వారికి నిరాశే ఎదురైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ జీఓ కారణంగా ఎల్‌బీనగర్ ప్రజలు అన్యాయానికి గురయ్యారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే ఒకలా, మండల తహసీల్దార్ మరోలా, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇంకోలా వ్యవహరిస్తున్నారని, దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. 118 జీఓను సరిచేసి పేదలకు ఎన్‌ఓసీ సర్టిఫికెట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రంగారెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, పవన్‌కుమార్, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి నాయకులు చింతల సురేందర్‌యాదవ్, రవీందర్‌గౌడ్, నాంపల్లి రామేశ్వర్, పాతూరి శ్రీధర్‌గౌడ్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆలయ వివాదాన్ని పరిష్కరిస్తా: ఎమ్మెల్యే



గుంటి జంగయ్యనగర్‌లో పెద్దలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్యనగర్ కాలనీలో ఆలయం విషయంలో ఇరువర్గాల మధ్య నెలకొన్న సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కాలనీలోని ఆలయం విషయమై కాలనీ పెద్దలు శుక్రవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి కొందరు వ్యక్తులు ఆలయం తమది అంటూ దౌర్జన్యానికి దిగుతున్నారని, ఈ విషయంలో న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఇరు వర్గాల వారిని పిలిపించి మాట్లాడి న్యాయం చేస్తానని కాలనీ పెద్దలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నాగోలు: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగోలు పోలీస్ స్టేషన్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీలో సైబర్ నేరాలు, 100 డయల్స్, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సైబర్ నేరస్తులు యువతను, మహిళలను లక్ష్యంగా చేసుకుని ఉద్యోగాలు, ఉపాధి పేరుతో మోసాలు చేస్తారన్నారు. అన్ని కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు తక్షణమే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యామల యాదగిరి నాయకులు గంగాధర్, శంకర్, రాహుల్, అశోక్, యాదిలాల్, శివకుమార్, వేణుగోపాల్ కృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

ఎల్‌పీటీ మార్కెట్ మర్చంట్స్ కమిటీ కార్యవర్గం ఎన్నిక



మర్చంట్స్ కమిటీ నూతన కార్యవర్గం

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్‌లోని లక్ష్మీపద్మవంశీ టెక్స్‌టైల్స్ (ఎల్‌పీటీ) మార్కెట్ మర్చంట్స్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మార్కెట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోమటి సత్యనారాయణ ఆధ్వర్యంలో మర్చంట్స్ కమిటీ సభ్యుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా నామని నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా గోర్ల వెంకటేష్, కోశాధికారిగా పెండెం రాజు, ఉపాధ్యక్షులుగా చెరుకుపల్లి పాండురంగం, జెల్ల జగన్, సహాయ కార్యదర్శులుగా నామని దత్తాద్రి, బోడ దాతఋషి, కార్యవర్గ సభ్యులుగా ఉదయ్‌శ్రీనివాస్, చెరిపల్లి శ్రీనివాస్, కృష్ణ, గణేష్, అశ్విన్, గజానంద్‌లను ఎన్నుకున్నట్లు ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోమటి సత్యనారాయణ తెలిపారు.

ఎస్ఎన్‌డీపీ పనుల పరిశీలన

బడంగ్‌పేట్: అల్మాస్‌గూడలోని 3వ డివిజన్, సాయి బాలాజీ టౌన్‌షిప్ కాలనీలో చేపడుతున్న వరద నీటి కాలువ (ఎస్ఎన్‌డీపీ) పనులను శుక్ర వారం బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత అధికారులతో కలిసి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో కాలువ పనులను వర్షాలు, వరదలు రాకముందే పూర్తి చేసేలా చూడాలన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని చైతన్యపురి పోలీస్ స్టేషన్ ఎస్ఐ రవి అన్నారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఇన్వెస్టిట్యూర్ కేబినెట్ ఇన్‌స్టాలేషన్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఐ రవి మాట్లాడుతూ, విద్యార్థి దశ ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో ముఖ్యమైనదని అన్నారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు.కేబినెట్ ఇన్‌స్టాలేషన్‌లో పలు తరగతుల్లో ఎంపికైన వారికి బ్యాడ్జీలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ నరసింహ, ప్రైమరీ ఇన్‌చార్జి రోహిణి తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ల విక్రయం... ఇద్దరి అరెస్టు



అరెస్టయిన నిందితులు, పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు

నాగోలు: పాల ఉత్పత్తిని పెంపొందించడానికి ఉపయోగించే ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లను అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. 36 ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఇద్దరినీ కటకటాల్లోకి నెట్టారు. నాగోలు పోలీసుల కథనం ప్రకారం.. నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని తట్టిఅన్నారం చౌరస్తాలో మల్లికార్జున పశువుల దాణా దుకాణంలో ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు అక్రమంగా విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో శుక్రవారం ఉదయం సదరు షాపుపై పోలీసులు దాడి చేశారు. అక్కడ షాప్ యాజమని సాయికుమార్, మాదన్నపేటకు చెందిన ఆరిఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఎటువంటి లేబుళ్లు లేని ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.